హరిత కళాకృతం.. అద్భుతం

పచ్చదనంతో కూడిన పరిసరాల ప్రభావం ప్రకృతికి అద్దం పట్టేలా ఉంటుంది. ఇక మొక్కలతో వివిధ రూపాల కల్పన చూస్తుంటే.. మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తోంది. ఆహా అనిపించే చెట్లు యాదాద్రి క్షేత్రాభివృద్ధిలో భాగంగా కొండ కింద గండి చెరువు సుందరీకరణ పథకం ద్వారా ఏపీలోని కడియం నర్సరీ నుంచి రప్పించిన సదరు మొక్కలతో వివిధ హరిత కళాకృతులుగా పోషించారు.



యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:

బీసీజీ టీకాపై అవగాహన కల్పించాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: త్వరలో చేయబోతున్న వయోజనుల బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమున్న ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా శిశు ఆరోగ్య, ఇమ్యునైజేషన్ కార్యక్రమ అధికారి రామకృష్ణ సూచించారు. యాదగిరిగుట్ట పీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. మండల వైద్యాధికారి విలియమ్ కేరీ, వైద్యురాలు పావని పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో కొలువు కళ

- వెల్లడైన ఫలితాలు
- జిల్లాలో భర్తీ కానున్న 277 పోస్టులు
- నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

భువనగిరి పట్టణం, నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ- 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వం జులై, ఆగస్టు నెలల్లో డీఎస్సీ పరీక్ష నిర్వహించి సోమవారం ఫలితాలు ప్రకటించింది. మొదటి సారి ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్ష ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1268 పోస్టులు భర్తీ చేయనున్నారు. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రి భువనగిరిలో 277 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వం పరీక్ష నిర్వహించి తక్కువ సమయంలో ఫలితాలు వెలువరించడంపై అభ్యర్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం ఫలితాలు ప్రకటించాక అధికారిక వెబ్‌సైట్ సర్వర్ పని చేయకపోవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బంది పడ్డారు. జిల్లాల వారీగా వివిధ సబ్జెక్టుల్లో ఖాళీలను 1:3 చొప్పున మంగళవారం నుంచి ధ్రువపత్రాల(సర్టిఫికెట్ల)ను పరిశీలించనున్నారు.

831 మందికి సమాచారం

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణ శివారులోని వెన్నెల కళాశాలలో మంగళవారం నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విడుదల చేసిన ఫలితాల ఆధారంగా జిల్లా పరిధిలో 277 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం. ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 831 మంది అభ్యర్థులు స్వయంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని చరవాణులకు సంక్షిప్త సమాచారం పంపినట్లు తెలిసింది. పరిశీలనకు జిల్లా వ్యాప్తంగా 40 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటున్నారు. వీరిని 15 బృందాలుగా ఏర్పాటు చేసి కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. చరవాణులకు సంక్షిప్త సమాచారం అందిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

కష్టాన్ని గుర్తించి.. కొలువులు సాధించి



జీవశాస్త్ర విభాగంలో మండలానికి చెందిన గిరెడ్డి బుచ్చిరెడ్డి జిల్లా స్థాయిలో-2వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో 11వ ర్యాంక్ సాధించి కొలువు కైవసం చేసుకున్నారు. అంతేకాక గ్రూప్-4 ఫలితాల్లో 1:3 జాబితాలో ధ్రువపత్రాల పరిశీలన దశకు ఎంపికయ్యారు. గ్రూప్-1కు ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సన్నద్ధం అవుతున్నారు. బుచ్చిరెడ్డి 2009 నుంచి 2019 వరకు వివిధ పత్రికల్లో ఉప సంపాదకుడిగా పని చేశారు.

–యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే:

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా..



కోరబోయిన సుధాకర్, నాతాళ్లగూడెం, వలిగొండ

వలిగొండ: నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు ప్రభుత్వ కొలువే లక్ష్యంగా చదివారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన కోరబోయిన సుధాకర్ ఎంఏ.బీఈడీ పూర్తి చేశారు. తల్లిదండ్రులు కోరబోయిన నర్సింహ- బుచ్చమ్మ ఇరువురు సుధాకర్ చిన్నతనంలోనే చనిపోయారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉన్న తమ్ముడిని గమనించి సంజీవ కష్టపడి కూలీ పనులు చేస్తూ ఉన్నత చదువులు చదివించాడు. సుధాకర్ ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకొని పట్టుదలతో చదివి తాజాగా వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో తెలుగు పండిట్ విభాగంలో మూడో ర్యాంకు సాధించినట్లు చెప్పారు. గణేశ్‌ను కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్థులు అభినందించారు.

పట్టుదలతో చదివి



గాజుల గణేశ్, గోపరాజుపల్లి

వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామానికి చెందిన గాజుల వీరయ్య- వెంకటమ్మ దంపతుల మూడో కుమారుడు గాజుల గణేశ్ ఎంఏ. బీఈడీ పూర్తి చేశాడు. దిల్‌సుఖ్‌నగర్‌లో 45 రోజులు ఓ కోచింగ్ సెంటర్‌లో చదివి తాజాగా వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో గణేశ్ తెలుగు పండిట్ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) విభాగంలో ఆరో ర్యాంకు సాధించాడు. రెండు ఉద్యోగాల్లో అర్హత సాధించిన గణేశ్‌ను తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

ఒడిసిపట్టాలంటే.. విడిచిపెట్టే..!



నీలగిరి పుర కార్యాలయంలో నిర్మించిన ఇంకుడుగుంత

నల్గొండ పురపాలిక, సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు దర్శనమిస్తున్నాయి. జలసంరక్షణ మాత్రం ఎండమావిగానే మారుతోంది. నీటిబొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకిపోయేలా చేసే చర్యలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా, ప్రోత్సాహకాలు అందిస్తున్నా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాల్లోని పురపాలికల్లో 2,36,550 గృహాలుండగా ఇప్పటి వరకు పది వేల ఇళ్లలోనే ఇంకుడుగుంతలు నిర్మించారు. దీంతో వాన నీరు వృథాగా పోతోంది.

తాజాగా ఆదేశాలు..

పట్టణాల్లో భూగర్భజలం తక్కువగా ఉన్నట్లు కేంద్ర జలశక్తిశాఖ విడుదల చేసిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఏటా కురుస్తున్న వర్షాలకు జల వనరులు నిండకపోగా. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లోనూ జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో 300 చ.గజాల పైబడి ఉన్న స్థలాల్లో, అన్ని నిర్మాణాల్లో విధిగా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ విభాగాల్లో, ప్రైవేటు వాణిజ్య భవనాల సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వించకపోయినా, అవి పాడైపోయినా మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం ఇంకుడుగుంత నిర్మాణానికి భవన నిర్మాణదారులు రూ.2,500 నుంచి రూ.నాలుగు వేల వరకు డిపాజిట్ చెల్లిస్తేనే ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తుంది. తవ్విన ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిర్మాణం సవ్యంగా ఉంటేనే ముందుగా చెల్లించిన డబ్బులు తిరిగి యజమానికి చెల్లించే వెసులుబాటు ఉంది.

అటకెక్కిందిలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో ఈ ఏడాది సుమారు 4500 భవన నిర్మాణాలు ప్రభుత్వ అనుమతితో చేపట్టారు. అందులో ఒకటి రెండు శాతం మినహా నిర్మాణదారులు గుంతలు తవ్వించలేదు. భవన నిర్మాణాల అనుమతి పొందే సమయంలో ఉన్న ధ్యాస తర్వాత ఉండటం లేదు. ఇంకుడు గుంతలు తవ్వి ఒక్కరు కూడా డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారు లేరు. 2020 నుంచి ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.2.13 కోట్ల నిధులు మూలుగుతున్నాయి.

పురపాలికల వారీగా వివరాలు

	సూర్యాపేట	నల్గొండ	యాదాద్రి
పురపాలికలు	5	8	6
నివాసాలు	82,340	92,420	61,790
డిపాజిట్లు(రూ.లక్షలు)	74	91	43

ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు

–ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

పట్టణంలో నీటి వృథాను నివారించి వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే వారు విధిగా ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని ఒడిసిపట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

3న ఇందిరాపార్కు వద్ద ధర్నా

భువనగిరి, న్యూస్‌టుడే: ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు మరోసారి ఆందోళన బాట పట్టనున్నారు. అలైన్‌మెంట్ మార్పు కోసం ప్రభుత్వం ఒత్తిడి చేసేందుకు అక్టోబరు 3న హైదరాబాద్ ఇందిరాపార్కు దగ్గర ధర్నా నిర్వహించనున్నారు. ప్రభుత్వ అవసరాల కోసం ఇప్పటికే ఐదుసార్లు భూములు ఇచ్చి నష్టపోయామని మరోసారి భూములు ఇస్తే ఈ సారి తాము రోడ్డున పడాల్సి వస్తుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి భూములు ఇచ్చి నష్టపోయే సమస్య లేదని భీష్మించుకుని కూర్చున్నారు. అలైన్‌మెంట్ మార్పు కోసం టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, నిర్వాసితుల సంఘం నాయకుడు అవిశెట్టి పాండు, అనిల్ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. యాదగిరిగుట్ట, తుర్కపల్లి, చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి మండలాలతో పాటు ఇతర జిల్లాల రైతులను ధర్నాకు సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో సోమవారం పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన పూజలు కొనసాగాయి. సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన కొనసాగించారు. ఉగ్ర నహరిని కొలుస్తూ, శ్రీ సుదర్శన నరసింహ హోమం నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణమూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాలు మోగుతుండగా వేదమంత్రాలతో సేవా పర్వాన్ని నిర్వహించారు. రాతి గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయాన్ని వెల్లడించారు.

యాదాద్రిలో మహాశివుడికి రుద్రాభిషేకం

యాదాద్రి క్షేత్రంలోని అనుబంధ ఆలయంలో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామిని కొలుస్తూ ఆరాధనలను విశేషంగా కొనసాగించారు. సోమవారం వేకువజామున సుప్రభాతంతో దైవారాధనలు మొదలయ్యాయి. మహాశివుడిని కొలుస్తూ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ పర్వం నిర్వహించారు. రుద్ర హోమం చేపట్టారు. సాయంత్రం సేవోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించి శివారాధనల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

రైతేరాజు 8లో..

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా వినతులను స్వీకరించారు. వివిధ 55 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో అత్యధికంగా భూ సంబంధిత సమస్యలకు 35, జిల్లా ఎంప్లాయిమెంట్ 7, జిల్లా పంచాయతీ అధికారి 6, జిల్లా వ్యవసాయ శాఖ 2, మున్సిపాలిటీ, శిశు సంక్షేమ, అటవీ, కో-ఆపరేటివ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖల ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. అదనపు కలెక్టర్లు కె. గంగాధర్, పి.బెన్‌షాలోమ్, జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏవో జగన్మోహన్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలు కన్నీటి పర్యంతం

తన స్థలంలో నిర్మించుకున్న ఇంటికి నెంబర్ కేటాయించడం లేదని జులై 27న ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటకు చెందిన వృద్ధురాలు సంపూర్ణ ప్రజావాణిలో కన్నీటి పర్యంతం అయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లో తన కుమారుడితో కలిసి వచ్చి మరోమారు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను పరిష్కరించాలని డీపీవో సునందను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు.

హిందూ దేవాలయాలపై ప్రభుత్వ జోక్యం నిలిపివేయాలి

భువనగిరి, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల జోక్యం నిలిపివేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి తోట భానుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పోత్నక్ రాఘవేందర్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శక మండలి పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగిన అపచారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు పోల శ్రీనివాస్‌గుప్తా, కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్, భజరంగ్ దళ్ విభాగం కన్వీనర్ సందీప్, కోశాధికారి చామ రవీందర్, ఉపాధ్యక్షుడు పసుపునూరి మనోహర్, సంతోష్‌రెడ్డి, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి తోట భానుప్రసాద్

ఎయిమ్స్‌లో ఫౌండేషన్ కోర్సు ప్రారంభం



ఫౌండేషన్ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్, బీఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ విద్యార్థుల కోసం సోమవారం ఫౌండేషన్ కోర్సు ప్రారంభించారు. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ భాటియా, భువనేశ్వర్ ఎస్‌వోఏ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఏకే మహాపాత్ర జ్యోతి వెలిగించారు. అనంతరం డాక్టర్ ఏకే మహాపాత్ర మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యం, రోగుల సంరక్షణ, పరిశోధన కార్యకలాపాలపై వివరించారు. బీబీనగర్ ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ జార్జ్ డిసౌజా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ అకాడమిక్‌పై ఓరియంటేషన్ ఇచ్చారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా ఆస్పత్రిలో సౌకర్యాలు, క్లినికల్ పోస్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో పరిశోధన విభాగం డీన్ డాక్టర్ సంగీతా సంపత్, మైక్రోబయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామలా అయ్యర్ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికి తీయాలి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు ఇచ్చారు. మాదాపురం ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన 68వ పాఠశాలల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొంత గ్రామం, తాను చదువుకున్న పాఠశాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను విద్యతో పాటు క్రీడలపై దృష్టి మళ్లించాలని అప్పుడే వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణిస్తారని పేర్కొన్నారు. మండల విద్యాధికారి వి.మాలతి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో యూన్సీలక్ష్మీబాయి, ఎస్సై తక్యుద్దీన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.బాలకృష్ణ, యువకులు పాల్గొన్నారు.



మాదాపురంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

దసరాకు 448 ప్రత్యేక బస్సులు

- నేటి నుంచి ఈ నెల 16 వరకు పండగ సర్వీసులు



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సమాయత్తమైంది. ఈ నెల 1 నుంచి 11 వరకు (3, 4, 8 తేదీలు మినహా) 448 బస్సులు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 13 నుంచి 16 వరకు 191 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సులన్నీ ఉమ్మడి జిల్లాలోని డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడిపేందుకు సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగగా.. దసరా రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టింది.

11న అత్యధికంగా సర్వీసులు

ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ నెల 11న అత్యధికంగా 125 బస్సులు నడుపనున్నారు. ఈ బస్సులు నల్గొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి హైదరాబాద్ వరకు, దేవరకొండ డిపో నుంచి ఐఎస్ సదన్ వరకు, యాదగిరిగుట్ట డిపో నుంచి ఉప్పల్ క్రాస్‌రోడ్డు వరకు నడవనున్నాయి. వీటితో పాటు ఆయా డిపోల నుంచి నిత్యం తిరిగే 516 సర్వీసులు యథావిధిగా నడవనున్నాయి.


ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..

ప్రత్యేక బస్సులు	డిపో	తిరుగు ప్రయాణంలో
74	నల్గొండ	30
37	నార్కట్‌పల్లి	12
84	మిర్యాలగూడ	34
45	కోదాడ	14
87	సూర్యాపేట	37
62	దేవరకొండ	32
59	యాదగిరిగుట్ట	32

ప్రత్యేక బస్సుల వివరాలు తెలుసుకునేందుకు సంప్రదించాల్సిన నంబర్లు..

డిపో	ఫోన్ నంబర్
మిర్యాలగూడ	08689-241111
నల్గొండ	86822 93622
సూర్యాపేట	73829 43819
సూర్యాపేట (హైటెక్ బస్టాండ్)	94949 26625
కోదాడ	99592 26302
నార్కట్‌పల్లి	98485 84198
దేవరకొండ	94905 10752
యాదగిరిగుట్ట	73828 36087

రద్దీకి అనుగుణంగా..



–రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా మొత్తం 639 ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమయ్యాం. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని అదనపు సర్వీసులు సైతం నడిపేందుకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎల్బీనగర్, హయత్‌నగర్ వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం.

రైతేరాజు

బొప్పాయిలో తెగుళ్ల నివారణ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: బొప్పాయిలో పలు తెగుళ్లు ఆశించి తోటలో మొక్కలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని వెంటనే సరైన సస్యరక్షణ చేపట్టాలని ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ సూచించారు.


వేరుకుళ్లు సోకిన బొప్పాయి

కాండం కుళ్లు వ్యాధి సోకితే వేర్ల మొదలు మెత్తగా మారి కుళ్లిపోతాయి. నివారణకు మొక్క ప్రారంభ భాగంలో నీరు నిల్వఉండకుండా చూడాలి. బోర్డో మిశ్రమం 1 శాతం పూయాలి. లేదా కాపర్‌సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల మొదలు తడపాలి. బూడిద తెగులు ఆశిస్తే ఆకులు కాడలు కొత్త చిగుళ్లపైన తెల్లటి బూడిదలాంటి శిలీంధ్రపు పెరుగుదల కన్పిస్తుంది. నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా కెరాథీన్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పంటల మార్పిడి.. లాభాల జడి

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రతిసారి ఒకే రకమైన పంటను సాగు చేయటంతో దిగుబడులు తగ్గి అన్నదాత నష్టాలను చవిచూస్తున్నాడు. రోజురోజుకు భూగర్భ జలం అడుగంటుతున్న తరుణంలో.. మారుతున్న కాలానికి అనుగుణంగా కొందరు రైతులు పంట మార్పిడి పద్ధతిని అనుసరిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ యువ రైతు కూరగాయలు పండిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

★ వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన శివర్ల రమేష్‌కు గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. గతంలో పత్తి సాగు చేస్తూ వచ్చారు. పెట్టుబడి అధికమవటం.. దిగుబడి తక్కువ రావటం.. కూలీల కొరత కారణంగా ఏటా నష్టాలు వచ్చాయి. నష్టాల నుంచి గట్టెందుకు ప్రత్నామ్నాయంగా కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాడు.


చింతపల్లిలో దొండతోటను సాగు చేస్తున్న శివర్ల రమేష్




కూరగాయల పంటలు

రూ.15 వేల పెట్టుబడితో..

రమేశ్ గతేడాది తన కున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో దొండ, వంకాయ, టమాట, బెండ తోటను సాగు చేశారు. ప్రతి పంటకు రూ.15 వేల పెట్టుబడి పెట్టి సాగు చేయగా.. దిగుబడి సకాలంలో అందటంతో చింతపల్లి, హైదరాబాద్ మార్కెట్‌లకు తెల్లవారుజామున ఆటోలో తీసుకెళ్లి విక్రయించడంతో లాభాలొచ్చాయి. ఒక్క పంట మీద సుమారు రూ.50 వేలకు పైగా లాభం వచ్చింది. ప్రస్తుతం బెండ, బీర, పచ్చిమిర్చి, సొరకాయ పంటలను వేశారు.

రూ. 4 లక్షలతో పందిరి

ఎకరంలో రూ.4 లక్షల వ్యయంతో డ్రిప్, రాతి కడీలను ఏర్పాటు చేసి.. దొండ తోటలను క్రమం తప్పకుండా సాగు చేస్తున్నారు. ఈ పందిరి సుమారు 20 ఏళ్ల వరకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉన్న భూమితోపాటు సమీప బంధువులకు చెందిన మరో ఐదు ఎకరాలకుపైగా పత్తి పంటలను సాగు చేస్తే పెట్టుబడులు సైతం రాకపోవడంతో సొంత ఆలోచనతో కూరగాయాల సాగు చేస్తున్నాను. మొదట్లో కూరగాయల సాగు చేయడంతో పెట్టుబడి కంటే అధిక దిగుబడులు రావడంతో మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేయడంతో సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వచ్చింది.

పత్తిలో సూక్ష్మధాతు లోపాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో సూక్ష్మధాతు లోపాలు, సవరణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. మెగ్నీషియం లోప లక్షణాలు ముదురు ఆకులు, అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగుకు మారతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలి పోతాయి. ఈ లోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నెలల్లో సాధారణంగా కనిపిస్తుంది. మెగ్నీషియం లోప నివారణకు లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45, 75 రోజుల తరువాత రెండు సార్లు పిచికారీ చేయాలి.

జింకు: పత్తిలో జింకు ధాతువు లోపం వల్ల ఆకుల ఈనెలు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం మాత్రమే పసుపు పచ్చగా మారుతుంది. నివారణకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలి, 0.2 శాతం జింకు సల్ఫేట్ ద్రావణాన్ని 2 గ్రా. లీటరు నీటికి పిచికారీ చేయాలి.

బోరాన్: పత్తిలో బోరాన్ లోపమున్నప్పుడు పూల స్వరూపం మారి ఆకర్షణ పత్రాలు చిన్నవై లోపలకు ముడుచుకుపోతాయి. ఆకులు కాడలు ఒకే రీతిన ఉండక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ రింగుల మచ్చలు ఏర్పడతాయి. బోరాన్ లోప నివారణకు పైరు వేసిన 60, 90 రోజుల తరువాత లీటరు నీటికి 1.5 గ్రా. బోరాక్స్ వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

సమస్య - సమాధానం

? వరిలో సుడిదోమ గురించి తెలపండి.
- నరసింహరావు, అనుముల

సమాధానం: నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనిపిస్తాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులతో ఎండిపోవటం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుంది. నివారణకు క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, లామ్డా సైహలోత్రిన్ పిచికారీ చేసుకోవాలి. పొలంలో నీటిని తగ్గించి మొక్కల మొదళ్లపై పిచికారీ చేయాలి.

? కందిలో ఎండు తెగుళ్ల లక్షణాలు, నివారణ గురించి తెలపండి.
- రమణారెడ్డి, పెద్దదేవులపల్లి

సమాధానం: తెగులు సోకిన మొక్కలు పూర్తిగా లేదా కొంతభాగం వాడి ఎండిపోతాయి. వాటిని పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. తెగులు అధికంగా కనిపించిన పొలాల్లో పొగాకు లేక జొన్నతో పంట మార్పిడి చేయాలి. నివారణకు మందులు లేవు. నీరు నిల్వ ఉండే భూముల్లో సాగు చేయకూడదు.


? బంతి పంటలలో నత్తల, నివారణ గురించి తెలపండి.
- అనంతుల వెంకటేష్, ఎర్రపాడ్

సమాధానం: నత్తలను సేకరించి సాధారణ ఉప్పు ఉన్న బకెట్‌లో ఉంచండి. నత్తలు రాత్రి సమయాల్లో చురుకుగా ఉంటాయి. వాటిని సేకరించడం ప్రధాన సమస్య. ఇంటి తోటల్లో సాధారణ ఉప్పుతో భౌతిక అవరోధం ఉంచండి. నివారణకు మెటల్డిహైడ్ 2.5 శాతం, డీపీ ఎసఎన్‌కిల్ 2.5 శాతం బైట్ ఎకరానికి 2 కిలోల చొప్పున ఉపయోగించాలి. మొక్కల దగ్గర చిన్న పరిమాణంలో నత్త పురుగుల ఎరలను 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 50, 80 గ్రా. ఉంచాలి.

- త్రిపురారం, న్యూస్‌టుడే

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771


కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు



సాత్వికాహారం.. దీర్ఘాయుష్షుకు మార్గం



శాకాహారంపై పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ(పాత చిత్రం)

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటారు. కానీ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. గతంలో ఎప్పుడో పండగలు, శుభాకార్యాలకు మాత్రమే తినే మాంసాహారం ప్రస్తుతం రోజువారీ భోజనంలో భాగమైంది. సాత్వికాహారమైన శాకాహారం ప్రాముఖ్యాన్ని వివరించేందుకు ఏటా అక్టోబరు ఒకటో తేదీన 'ప్రపంచ శాకాహార దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

వివిధ ఆహార పదార్థాలలో పోషకాల వివరాలు(వంద గ్రాముల పరిమాణంలో)

పదార్థం	ప్రొటీన్లు	పిండి పదార్థాలు	కేలరీలు
మేక మాంసం	21.4	-	118
చేపలు	76	9.0	413
కోడి మాంసం	24	-	132
కోడి గుడ్డు	6	1	73
సోయాబీన్స్	52	33	349
వేరుసెనగలు	19	61	374
బాదంపప్పు	20.8	10.5	655
గేదెపాలు	4.3	5.0	117
పెరుగు	3	4	55

సోయాబీన్స్(3.7), వేరుసెనగలు(3.1), బాదం పప్పు(1.7) మాత్రమే పీచు పదార్థాలు ఉంటాయి

❖ నేడు 'ప్రపంచ శాకాహార దినోత్సవం'

ధార్మిక సంస్థల సేవలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 లక్షలకు పైగా జనాభా ఉండగా.. వీరిలో 80 శాతం మంది ఏదో ఒక సందర్భంలో మాంసాహారం తిని ఉంటారని అంచనా. కరోనా కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాంసాహారం తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం శాకాహారానికి మారుతున్న వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. శాకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు పిరమిడ్ ధ్యాన కేంద్రం, శ్రీ రామ చంద్ర మిషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థలు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



శరీరం తేలికగా ఉంది: పల్‌రెడ్డి కృష్ణారెడ్డి, మిర్యాలగూడ

అనారోగ్యం కారణంగా 2020లో మాంసాహారం తినడం తాత్కాలికంగా మానేశాను. శాకాహారం తినడం వల్ల మనసు, శరీరం తేలికగా ఉన్నట్లు అనిపించడంతో ఇంతవరకు గుడ్డు కూడా ముట్టుకోలేదు. నిత్యం పప్పులు, ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు తినడం వల్ల ప్రస్తుతం నా వయసు 50 ఏళ్లు దాటినా ఆరోగ్యంగా ఉన్నాను.

శరీరతత్వాన్ని బట్టి ఆహారం

–వేజెండ్ల జాహ్నవి, న్యూట్రిషనిస్ట్, మిర్యాలగూడ

మాంసాహారం కంటే శాకాహారమే మేలని నిపుణులు చెబుతున్నప్పటికీ శరీరతత్వాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో ఆహారాన్ని సిఫారసు చేస్తుంటాం. మాంసాహారంలో అత్యధిక ప్రొటీన్ ఉండడం వల్ల.. అది అవసరమయ్యే వారికి మాంసాహారం తీసుకోవాలని చెబుతాం. శాకాహారంలోనూ ప్రొటీన్లు లభించే పదార్థాలు ఉన్నాయి. వీటిలో సోయా, వేరుసెనగలు వంటివి ఉన్నాయి. మాంసాహారులతో పోలిస్తే గుండెజబ్బులు, గుండెపోటు వల్ల వచ్చే మరణాలు శాకాహారుల్లో తక్కువగానే నమోదవుతున్నాయి.



గేదెల బీమా పత్రానికి లంచం వసూలు

నగదు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి

చింతపల్లి, న్యూస్‌టుడే: రాయితీ రుణం తీసుకొని గేదెల ఫాం పెట్టుకోవడానికి అవసరమైన ఆరోగ్య, బీమా ధ్రువీకరణ పత్రాల కోసం రైతుల నుంచి లంచం వసూలు చేసిన మండల పశువైద్యాధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, అధికారులు తెలిసిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నసర్లపల్లి గ్రామానికి చెందిన రాసిక వినోద్, రాసిక కుమార్ అనే ఇద్దరు రైతులు పీఎంఈజీపీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రాయితీపై రూ.20లక్షల రుణం తీసుకొని ఎనిమిది గేదెలను కొనుగోలు చేశారు.


జోసెఫ్ పాల్

మొదటి విడతగా రూ.10లక్షల రుణం మంజూరు చేశారు. రెండో విడత రుణం కావాలంటే పశువైద్యాధికారుల నుంచి గేదెలకు బీమా, ఆరోగ్య ధ్రువపత్రం తీసుకురావాలని బ్యాంకు అధికారులు సూచించారు. దీంతో వీరిద్దరూ మండల పశువైద్యాధికారి జోసెఫ్ పాల్‌ను సంప్రదించారు. గేదెలకు విలువ, బీమా, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటే ఆయన రూ.20వేల లంచం అడిగాడు. అంత మొత్తం ఇవ్వలేమని పలుమార్లు వైద్యాధికారిని వేడుకున్న స్పందన లేదు. దీంతో చేసేదేమీ లేక రూ.8 వేలు ఇస్తామని చెప్పి, సోమవారం డబ్బులు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జోసెఫ్ పాల్‌కి రూ.6వేల లంచం ఇస్తుండగా అప్పటికే నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకొని కస్టడీలోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర తెలిపారు. పాల్ ఇంటిపై దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064 సమాచారం అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రామారావు, వెంకట్‌రావు, సిబ్బంది ఉన్నారు.

▷ వృద్ధులకు ఆర్థిక భద్రత, ఆరోగ్య రక్షణ, నివాస వసతి ప్రధానమైనవి. వీటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 అమలులోకి తెచ్చింది. ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా ఆర్డీవోలు నియమితులయ్యారు. వారు వృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరించి విచారణ నిర్వహించి పోషణ కోసం తీర్పులు వెలువరిస్తున్నారు.

▷ వృద్ధుల కోసం జాతీయ స్థాయిలో 'హెల్ప్‌లైన్' ను ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు: 14567

ప్రశాంతంగా శేషజీవితం గడపాలని...

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: దిక్కూమొక్కూ లేనివారు వృద్ధాప్యంలో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా పెద్దకొండూరులో వానప్రస్థాశ్రమాన్ని నిర్మించారు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు. ఎకరం విస్తీర్ణంలో ఇరవై గదులతో ప్రశాంతమైన వాతావరణంలో కోటి రూపాయలు తమ సొంత డబ్బు వెచ్చించి వారు ఈ ఆశ్రమం కట్టారు. నిరాశ్రయులైన వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించి నిర్వహించే ఒప్పందంతో ఈ వానప్రస్థాశ్రమాన్ని, ఎకరం భూమిని రెడ్‌క్రాస్ సంస్థకు స్వాధీనం చేస్తూ రాష్ట్ర గవర్నర్ పేరిట దానపత్రాన్ని వారు అందజేశారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన 'సాయి యాదాద్రి సేవా ఆశ్రమం' ఆధ్వర్యంలో 2020 నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో యాభై మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి నాణ్యమైన భోజనం, వస్త్రాలు, ఈ ఆశ్రమంలో నిర్వహిస్తున్న గోశాలలోని ఆవు పాలు, పెరుగును ఆశ్రమవాసులకు అందిస్తున్నారు. మానసిక ప్రశాంతత కోసం సాయంత్రం భజన, సత్సంగం నిర్వహిస్తున్నారు. ఉదయం ధ్యానం, యోగా సాధన చేయిస్తారు. గ్రంథాలయం ఏర్పాటు చేశారు. వంద మంది వృద్ధులకు సరిపడేంత వసతి పెంచేందుకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.50లక్షలు, దాతల విరాళాలతో వసతిగృహం నిర్మిస్తున్నారు. 'దాతల నుంచి ఇప్పటి వరకు రూ.1.25 కోట్ల విరాళాలు సమకూరాయని, ఆ నిధులతో నాలుగేళ్లుగా వానప్రస్థాశ్రమాన్ని సేవాభావంతో నిర్వహిస్తున్నామ'ని సాయియాదాద్రి సేవాశ్రమం అధ్యక్షుడు దెబ్బటి అశోక్, కార్యదర్శి కేవై శెట్టి తెలిపారు.


చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మలు నిర్మించిన వానప్రస్థాశ్రమం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీల దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మయూర్‌బంజ్ ప్రాంతానికి చెందిన రాజు కిశోర్ సింగ్(39), బాసోతా బాగుడి(21), ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మనిష్ కుమార్‌వర్మలు గత కొంత కాలం నుంచి దండుమల్కాపురం గ్రామ శివారులోని క్రషర్‌లో పని చేస్తున్నారు. క్రషర్ సమీపంలో క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటారు. వీరు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండటంతో దండుమల్కాపురం గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో చౌటుప్పల్ ఆసుపత్రికి వస్తుండగా.. ఐవోసీఎల్ టెర్మినల్ ఎదురుగా వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు కిశోర్ సింగ్, బాసోతా బాగుడి మృతి చెందారు. మనిష్ కుమార్ వర్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 13 గ్రానైట్ లారీల పట్టివేత

కోదాడ న్యూస్‌టుడే: అక్రమంగా గ్రానైట్ రాయిని తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనింగ్ అధికారుల కథనం ప్రకారం.. అనంతగిరి మండలం బొజ్జగూడెం పరిధిలో కోదాడ మండలంలోని చిమిర్యాల మిడ్‌వెస్ట్ కంపెనీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 13 లారీల్లో గ్రానైట్ రాయిని ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో మొదటగా 6 లారీలు పట్టుకోగా, తర్వాత మరో 7 లారీలను అదుపులోకి తీసుకున్నారు. చలానాలు చెల్లించేవరకు సీజ్ అయిన వాహనాలను కోదాడ పట్టణ పరిధిలో భద్రపరిచారు. అనుమతి లేకుండా గ్రానైట్‌ను తరలిస్తుండగా గ్రానైట్‌ను సీజ్ చేసి రూ.15 లక్షలకు పైగా జరిమానా విధించామని మైనింగ్ జిల్లా అసిస్టెంట్ జియాలజిస్ట్ విజయరామరాజు తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్నందున వాహనాలను సీజ్ చేశామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గిలాని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది రామ్మూర్తి, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు తెలిపారు.


పట్టుకున్న గ్రానైట్ లారీలు

స్నేహితుడి కారు కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

కోదాడ, వేములపల్లి, చిలుకూరు, న్యూస్‌టుడే: స్నేహితుడికి కారు కొనాలని మరో ఇద్దరు స్నేహితులు తోడుగా వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్(22) అనే వ్యక్తి మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో బేకరీ దుకాణం నడుపుతున్నాడు. దసరా పండగకు ఆఫర్లు ఉంటాయని నూతన కారు కొనేందుకు తన స్నేహితులైన వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన వలపుదాసు వంశీ(22), మాడ్గులపల్లి మండలం ఆగమోత్కూర్ గ్రామానికి చెందిన అభిరాళ్ల శ్రీకాంత్(21) అనే ఇద్దరు స్నేహితులను తీసుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి వచ్చాడు. కారు కొనేందుకు ఓ షోరూంనకు వెళ్లి ముందస్తుగా కొంత డబ్బులు చెల్లించి, అనంతరం స్వగ్రామాలకు ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చిలుకూరు మండలం మిట్స్ కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు, లారీ మధ్యలో నుంచి వెళ్లడంతో లారీని ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలాన్ని కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి పరిశీలించారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు చిలుకూరు ఎస్సై రాంబాబుగౌడ్ తెలిపారు.


వలపుదాసు వంశీ


మల్లికంటి దినేశ్


శ్రీకాంత్

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

2 నెలల వ్యవధిలోనే తండ్రీ కుమారుల మృతి..

తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ఉండే బాధ మాటల్లో వర్ణించలేం. అలాంటి కుటుంబంలో తండ్రి మరణించినట్లుగానే ఏకైక కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో మరణిస్తే అలాంటి ఘటనను ఊహించుకుంటేనే భయమేస్తుంది. కానీ అలాంటి ఘటనే త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారానికి చెందిన మల్లికంటి దినేశ్ కుటుంబానిది. 2 నెలల వ్యవధిలోనే భర్త శ్రీనివాస్, కుమారుడిని కోల్పోయిన ఆ తల్లి(పార్వతమ్మ) శోకం తీరనిది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రాణదాతలు

వైద్యులు వ్యతిరేకించినా పట్టువీడలేదు

–పులిజాల శ్రీదేవి, నల్గొండ



హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తాను. రెండేళ్ల క్రితం నా భర్తకు అనారోగ్యం కారణంగా రక్తం అవసరం కాగా.. నేను ఇచ్చేందుకు ముందుకు వచ్చాను. మహిళ నన్న కారణంతో నా నుంచి రక్తం సేకరించేందుకు వైద్యులు నిరాకరించారు, అయినా పట్టువీడకపోవడంతో ఒప్పుకున్నారు. అలా తొలిసారిగా రక్తదానం చేశాను. నాది బీ పాజిటివ్. ఇప్పటి వరకు 11 సార్లు రక్తదానం చేశాను.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేయడంతో ప్రాణాలు దక్కించుకున్న వారు అనేక మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సరిపడా రక్త నిల్వ కేంద్రాలు లేకపోవడంతో బాధితులకు ఒక్కోసారి సకాలంలో రక్తం అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. పలువురు యువత ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు తమ స్నేహితుల ద్వారా దానం చేయిస్తూ ఆపత్కాలంలో ఆదుకుంటున్నారు. ఇటీవల మహిళలు సైతం ముందుకువస్తున్నారు. నేడు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

☛ నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రక్త నిల్వ కేంద్రాలు కరవు..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రులతో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండలోని ప్రభుత్వ దవాఖానాల్లో రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండలో మూడు, మిర్యాలగూడలో రెండు, సూర్యాపేటలో ఒకటి, నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో ఒకటి చొప్పున ప్రైవేట్ ఆధ్వర్యంలోని రక్త నిల్వ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండ జిల్లా పరిధిలో 60 మంది తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు ఉన్నారు. వీరికి అవసరాన్ని బట్టి ఒక్కొక్కరికి నెలకు ఒకటి నుంచి ఐదు యూనిట్ల రక్తం అవసరం. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

21 సార్లు రక్తదానం చేశాను:

–కస్తూరి సురేష్, ఇంటీరియర్ డిజైనర్, కోదాడ



నాది ఏబీ పాజిటివ్ గ్రూపు రక్తం. రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్నారనే వార్తలు చూసి చలించి.. 2016లో తొలిసారి రక్తదానం చేశాను. ఇప్పటి వరకు మొత్తం 21 సార్లు రక్తదానం చేశాను. దీని కోసం మెగా బ్లడ్ డొనేషన్ ట్రస్టు పేరుతో సంస్థను, వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేశాను. దీని ద్వారా సుమారు రెండు వేల మందికి పైగా రక్తదానం చేయించాను. రెండేళ్ల క్రితం ఓ చిన్నారికి అత్యవసర సమయంలో విజయవాడ వెళ్లి రక్తదానం చేయగా. . ఆ కుటుంబ సభ్యులు దేవుడిలా చూడటం మరచిపోలేని అనుభూతి. జనయేత్రి ఫౌండేషన్ మిర్యాలగూడ, సిరి రక్తనిల్వ కేంద్రం, ఖమ్మం నుంచి అవార్డులు సైతం అందుకున్నాను.

డీఎస్సీ ఫలితాల్లో సత్తా


గుండాల, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఉపాధ్యాయ ఫలితాల్లో మండల విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో సత్తా చాటారు. మంచి ర్యాంకులు సాధించడంతో ఉద్యోగం వచ్చే అవకాశం ఉండటంపై పలువురు అభినందిస్తున్నారు.

తండ్రి కల నెరవేర్చిన తనయుడు...



మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బసవ లింగం, ఉప్పలమ్మ దంపతులకు జన్మించిన **బసవ సాయిశశాంక్** స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో జిల్లా స్థాయి 7వ ర్యాంకు సాధించారు. శశాంక్ తండ్రి బసవ లింగం సహితం సాంఘిక శాస్త్రంలో బీఈడీ పూర్తి చేసి 1998వ సంవత్సరం నిర్వహించిన డీఎస్సీ ఫలితాల్లో అర్హత సాధించి 1998 డీఎస్సీ బాధితుడిగా మిగిలి పోవడం గమనార్హం.

మొదటి ప్రయత్నంలోనే



మండల కేంద్రానికి చెందిన **కొడవల్ల వెంకటేశం** మొదటి ప్రయత్నంలోనే ఎస్జీటీలో 18వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. వెంకటేశం ప్రాథమిక విద్య నుంచి 10వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించారు. అనంతరం ఉపాధ్యాయ విద్యలో శిక్షణ పూర్తి చేసి వివాహం అనంతరం ముగ్గురు పిల్లలతో కుటుంబ భారం మోస్తూ ఇంటి వద్దనే పరీక్షకు సన్నద్ధమై మొదటి ప్రయత్నంలో జిల్లా స్థాయిలో 18వ ర్యాంకు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.



మండల కేంద్రానికి చెందిన మరో విద్యార్థిని **మదర బోయిన నవ్య** మొదటి ప్రయత్నంలో ఎస్జీటీలో 57వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అడ్డగూడూరు: సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మండలవాసులు ప్రతిభ కనబరిచారు. లక్ష్మీదేవికాల్వకు చెందిన **బండి నాగరాజు** ఎస్జీటీ విభాగంలో 78.53 మార్కులతో యాదాద్రి జిల్లా మూడో ర్యాంకు సాధించారు. అదే గ్రామానికి చెందిన పొన్నాల శేఖర్ ఎస్జీటీ విభాగంలో 65మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 81వ ర్యాంకు సాధించారు. జానికిపురానికి చెందిన గొడిశాల నాగరాజు ఎస్జీటీ విభాగంలో 26వ ర్యాంకు సాధించగా, ఎన్నారం ఉమేష్‌చంద్ర 77వ ర్యాంకు సాధించారు.



బండి నాగరాజు | పొన్నాల శేఖర్

సంస్థాన్‌నారాయణపురం: డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన పలువురు యువతులు తమ సత్తా చాటారు. మండల కేంద్రానికి చెందిన గుర్రం చంద్రకళ, ఉదావత్ ఇందిర (పొర్లగడ్డతండా), చిలువేరు మౌనిక, బొడ్డుపల్లి మాలతిలు ఎస్జీటీ విభాగంలో అర్హత సాధించారు.

కష్టం ఫలించింది..: మాటూరి మానస



భువనగిరి గ్రామీణం: మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన మాటూరి మానస 9వ ర్యాంకు సాధించింది. పట్టుదలతో చదివి 76.97 శాతం మార్కులు పొంది 9వ ర్యాంకు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది.

దివిస్ పరిశ్రమ తోడ్పాటు ప్రశంసనీయం

వలిగొండ, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి దివిస్ పరిశ్రమ అందిస్తున్న తోడ్పాటు ప్రశంసనీయమని మాజీ సర్పంచి మద్దెల సందీప్‌కుమార్ కొనియాడారు. మండలంలోని జాలు కాల్వలో దివిస్ పరిశ్రమ సౌజన్యంతో రూ.5.36 లక్షల విలువ చేసే నీటి శుద్ధి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. దివిస్ అధికారి ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి అపర్ణ, చంద్రారెడ్డి, మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.



వలిగొండ: జాలు కాల్వలో నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన దివిస్ అధికారి సాయి కృష్ణ, మాజీ సర్పంచి మద్దెల సందీప్ కుమార్, తదితరులు

అంకితభావంతో పని చేయాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మండల విద్యాధికారి గవ్వ జ్యోతి అన్నారు. రామన్నపేటలోని ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యాధికారిని సోమవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కట్ట మల్లయ్య, జనపాల కిషన్, కంచి రవికుమార్ పాల్గొన్నారు.



పదవీ విరమణ చెందిన డ్రైవర్ లక్ష్మయ్యతో డీఎం శ్రీనివాస్, ఆర్టీసీ ఉద్యోగులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: అంకితభావంతో పని చేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుందని యాదగిరిగుట్ట డీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. డిపోనకు చెందిన డ్రైవర్ బోనబోయిన లక్ష్మయ్య పదవీ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి మాట్లాడారు. ఈయూ సంఘం డిపో కార్యదర్శి సోకం వెంకటయ్య, సహాయ డీఎం ప్రవీణ్, ఏఈ హనుమాన్ నాయక్, నాయకులు ఉన్నారు.


తహసీల్ కార్యాలయం తనిఖీ

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: రాచకొండలో అసైన్డ్, ధరణి పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని సోమవారం చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తహసీల్దార్ మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలని విన్నపం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘాల, చేనేత కార్మికుల రుణాలన్నీ మాఫీ చేసి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని పద్మరత్న చిక్క నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్‌లో సోమవారం నిర్వహించిన చేనేత సహకార సంఘం వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి కందగట్ల భిక్షపతి అధ్యక్షత వహించారు.

చిన్నారుల క్రమ శిక్షణ భళా..



రాజపేటలోని ఉన్నత పాఠశాల ఆవరణలో రోడ్డుపై విద్యార్థుల పుస్తకాల సంచీలు క్రమపద్ధతిలో ఇలా..

ఇదేదో ఎరువుల కోసం క్యూ లైన్ మాదిరిగా వేసిన తీరు అంటే పొరపాటు పడ్డట్లే. రాజపేటలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తాము పాఠశాల ముగియగానే ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో రోడ్డుపై పద్ధతిగా తమ పుస్తకాల సంచీలను అమర్చారు. వీరంతా సుమారు ఎనిమిది కిలో మీటర్ల దూరంలో గల కొండ్రెడ్డి చెరువు, పుట్టగూడెం గ్రామాలకు చెందిన వారు. వీరి పాఠశాల ముగింపు సమయం సాయంత్రం 4:15 కాగా, వీరు ఆర్టీసీ బస్సులు తిరిగి ఇంటికి వెళ్లడానికి వచ్చే బస్సు సమయం 5:30 గంటలకు వస్తుంది. ఈ ఖాళీ సమయంలో కొందరు విద్యార్థులు పాఠశాల మైదానంలో హోంవర్క్ చేసుకునే పనిలో బిజీగా ఉంటుండగా, మరికొందరు ముచ్చట్లలో మునిగిపోయారు. అయితే క్రమ పద్ధతిలో వీరి పుస్తకాల సంచీలను రోడ్డుపై పెట్టి ఉండటాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా సోమవారం బంధించింది. ఈ రకంగా ఉపాధ్యాయుల సూచనలు తుచా తప్పకుండా నడుచుకుంటున్న విద్యార్థుల క్రమశిక్షణను స్థానికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. – రాజపేట, న్యూస్‌టుడే :

సాగు నీటి కాల్వల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

వలిగొండ, న్యూస్‌టుడే: సాగు నీటి కాల్వల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అక్కా చెల్లెళ్ల చెరువుతో పాటు, సంగెం, ప్రొద్దుటూరు, నాతాళ్లగూడెం, మల్లేపల్లి వెలువర్తి, వెంకటాపురం, చిత్తాపురం గ్రామాల్లో భీమలింగం, బునాదిగాని కాల్వలను సోమవారం నీటి పారుదల అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. సాగు నీరు అందించే కాల్వలను అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సుమారు రూ.500 వందల కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. మాజీ ఎంపీపీ నూతి రమేశ్ రాజు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, పాశం సత్తిరెడ్డి, తుమ్మల యుగేందర్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, నాగేశ్వర్, శ్రీనివాస్, బాలరాజు, మల్లేశం పాల్గొన్నారు.



భీమలింగం కాల్వను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, తదితరులు

జిల్లా ప్రజలు రుణపడి ఉంటారు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేయించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు జిల్లా ప్రజలు రుణపడి ఉంటారని మున్సిపల్ మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. హైదరాబాదులోని ఆయన నివాస గృహంలో సోమవారం ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. వైద్య కళాశాలకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని పొందేందుకు మంత్రి రాజనర్సింహ కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న పుర మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్

రైతుల కళ్లల్లో సంతోషం నింపడమే లక్ష్యం: బీర్ల

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో గోదావరి జలాలతో రైతాంగాన్ని పూర్తి సస్యశ్యామలంగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కళ్లలో సంతోషాన్ని నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని మాల్లాపురం, సైదాపురం గ్రామంలో ఉన్న కాలువలను అధికారులు, నాయకులతో కలిసి సోమవారం ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం ధర్మారెడ్డిగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తుందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. ఆయన వెంట ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ చైతన్య రెడ్డి, మాజీ సర్పంచి కలకుంట్ల సరిత, ఎంపీడీవో నవీన్ కుమార్, ఎంపీవో సలీం, మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాల్‌రాజ్, మదర్ డేరీ డైరెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.



ఆలేరు: పెద్దవాగులో గోదావరి జలాలకు హారతి ఇస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆలేరు: ఆలేరు నియోజకవర్గంలోని వంద చెరువులను ఈ సారి గోదావరి జలాలతో నింపుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గంధమల్ల చెరువు అలుగు నీటి ప్రవాహం ఆలేరు పెద్దవాగులోకి చేరిన సందర్భంగా సోమవారం ఆలేరు పెద్దవాగు వద్ద గంగ పూజ చేశారు. నియోజకవర్గంలో తాగు, సాగు నీటి ఇబ్బందుల శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జనగాం ఉపేందర్‌రెడ్డి, నీలం పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, దూడల రమేష్, పాల్గొన్నారు.

ఇంటింటికీ భగవద్గీత

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఇంటింటికీ భగవద్గీత ప్రచారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో సోమవారం నిర్వహించారు. ఇస్కాన్ ప్రచురించిన భగవద్గీత, ఇతర గ్రంథాలతో కూడిన సంచార పుస్తకాలయం ఖమ్మం నుంచి చౌటుప్పల్‌కు చేరుకుంది. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు విష్ణుస్వామి దాసు, రామ్‌లక్ష్మణ్ ప్రభు, త్రిభువన్ ప్రభు, లలిత గోపీదేవిలు భగవద్గీత గొప్పదనాన్ని ప్రచారం చేశారు.

నిబంధనలు పాటించాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బిల్లులను నిబంధనల మేరకు ఉపకోశాధికారి కార్యాలయంలో సమర్పించాలని రామన్నపేట ఉపకోశాధికారి గంగుల పురుషోత్తంరెడ్డి కోరారు. రామన్నపేటలోని కార్యాలయంలో వివిధ శాఖల డ్రాయింగ్ ఆఫీసర్లకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

అర్హులందరికీ రుణమాఫీ

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో సభ్యులై ఉండి రుణమాఫీ కాని రైతులందరికీ త్వరలోనే మాఫీ అవుతుందని ఆ సంఘం ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆ సంఘం 56వ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. డైరెక్టర్లు జి. లక్ష్మీనర్సింహారెడ్డి, పి. మల్లయ్య, కె. ముత్తయ్య, పద్మారెడ్డి, స్వామి, పద్మ, సుజాత, రాములు, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.



మోత్కూరు రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో నివేదికను చదువుతున్న అధికారి

నిర్మాణాలు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వం ప్రారంభించిన భారీ నిర్మాణ పనులను ఉద్దేశ పూర్వకంగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయడం లేదని రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొల్పుల అమరేందర్, భారాస పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్ ఆరోపించారు. భారాస ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. నాయకులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ఖాజా అజీమొద్దీన్, దిడ్డికాడి భగత్, చెన్న మహేష్, తుమ్మల పాండు, తాడూరి భిక్షపతి, ఇస్మాయిల్, సుభాష్, శివ, సూరజ్, పండు పాల్గొన్నారు.



విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భారాస నాయకులు

పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడంలో పబ్లిక్ రిలేషన్స్ పాత్ర ముఖ్యమని కలెక్టర్ హన్మంత్ కె. జెండగే అన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ రిలేషన్స్ బాధ్యతను జిల్లా పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు నిర్విఘ్నంగా నెరవేర్చారన్నారు. అదనపు కలెక్టర్ గంగాధర్, రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.



జిల్లా పౌర సంబంధాల అధికారి పి.వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

నీటి సరఫరా, పారిశుద్ధ్యంపై తీర్మానం

పోచంపల్లి, న్యూస్‌టుడే: పోచంపల్లి పురపాలక సంఘం సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ ఛైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణ నీటి సరఫరా నిర్వహణ, పారిశుధ్యంపై తీసుకునే చర్యలపై తీర్మానం చేశారు.

మొక్కలను సంరక్షించాలి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: నాటిన మొక్కలను సంరక్షించాలని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని నాలుగు వార్డుల్లో సోమవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మహిళలకు మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు.

చేనేత సహకార మహాసభ

కొయ్యలగూడెం(చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని చేనేత సహకార సంఘం 79వ మహాసభను ఆ సంఘం అధ్యక్షుడు గడ్డం జయశంకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సభలో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సంఘం జమా ఖర్చులను, అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. చేనేత రుణమాఫీ ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జెల్ల ఈశ్వరమ్మ, మాజీ సర్పంచులు మాచర్ల కృష్ణ, గడ్డం నర్సింహ, సూర్యానారాయణ, మధుసూదన్, రమాశంకర్, కొండల్ పాల్గొన్నారు.

గిడ్డంగుల్లో నిల్వచేసి రుణాలు పొందొచ్చు

మోత్కూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు వ్యవసాయ గిడ్డంగుల్లో ఆ పంటలను నిల్వ చేసుకొని 8 నుంచి 9శాతం వడ్డీతో రుణాలు పొందవచ్చని రాజేంద్రనగర్ జాతీయ మొక్కల ఆరోగ్య యజమాన్య సంస్థ సహాయ సంచాలకురాలు డాక్టర్ పి.జ్యోతి సూచించారు. సోమవారం మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో ఏరువాక కేంద్రం, జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీహెచ్‌సీలో హృదయ దినోత్సవం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బొల్లేపల్లి పీహెచ్‌సీలో హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య సిబ్బందికి సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ శిల్పిని మాట్లాడారు. వైద్యాధికారిణి డాక్టర్ యామినిశృతి, కమ్యూనిటీ హెల్త్ అధికారి జ్ఞానేశ్వర్, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సోమవారం భాజపా మోత్కూరు పట్టణశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మోత్కూరులో కోతులను కట్టడి చేయాలని పుర ఇన్‌ఛార్జి కమిషనర్ సి. శ్రీకాంత్‌కు వినతి అందజేశారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని లింగారెడ్డిగూడెం శివారులోని పిలాయిపల్లి కాల్వ కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ సోమవారం తెలిపారు. ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గంగాడకు చెందిన గుండ్ల గణేశ్(40) భార్యతో కలిసి ఐదు నెలల నుంచి మందోల్లగూడెంలోని చింతపల్లి నర్సింహరెడ్డి కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. ఆదివారం చౌటుప్పల్‌లో సంత కావడంతో సరకులను కొనేందుకు గణేశ్ తోటి కూలీలతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో డ్రైవర్ పక్కనే కూర్చున్న గణేశ్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో ట్రాక్టర్ టైరు అతనిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తి హఠాన్మరణం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన అంబటి భిక్షపతి(60) గుండెపోటుకు గురై మృతి చెందాడు. దర్జీ పని చేసే భిక్షపతి వ్యక్తి గత పని నిమిత్తం సోమవారం భువనగిరికి వచ్చారు. బస్టాండ్‌లో ఉండగా ఒక్కసారి కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్న వారు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వివాహం అయింది.

సభ్యత్వ నమోదు

రామన్నపేట, న్యూస్‌టుడే: సిరిపురం, రామన్నపేట, సర్నేనిగూడెం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ నాయకులు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్ మాట్లాడారు. ఎం. వెంకటరెడ్డి, లింగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి

రామన్నపేట, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రామన్నపేటలో భారాస ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. పోచబోయిన మల్లేశం, సాల్వేరు అశోక్, బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, కన్నెబోయిన బలరాం, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘాలకు 12 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించడం లేదని, వెంటనే నిర్వహించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మోత్కూరు చేనేత సహకార సంఘం 79వ సాధారణ మహాసభ ఆ సంఘం అధ్యక్షుడు జల్ది రాములు అధ్యక్షతన జరిగింది. గుండాల, రహీంఖాన్‌పేట సంఘాల అధ్యక్షులు డి.ఉప్పలయ్య, కె.సత్యనారాయణ, రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

చెరువులో చేపల చోరీ, కేసు నమోదు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండలం చిన్నకొండూరులోని చెరువులో చేపలను చోరీ చేసేందుకు వచ్చి ఇద్దరు నిందితులు స్థానికులకు చిక్కారు. వలిగొండ మండలం గోకారానికి చెందిన కొంత మంది వ్యక్తులు అక్రమంగా చేపలను తీసుకెళ్లేందుకు సెప్టెంబరు 28 రాత్రి వచ్చారు. సమాచారం స్థానిక మత్స్యకారులకు తెలియడంతో వారు చెరువు వద్దకు వెళ్లారు. కొందరు తప్పించుకోగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. పట్టుబడిన కట్ట భిక్షపతి, కట్ట శ్రీశైలంను పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణమల్ సూర తెలిపారు.

పోషక యాజమాన్యంపై శిక్షణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వివిధ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యంపై వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మండలంలోని తాజ్‌పూర్‌లో సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్త కె. మమత మాట్లాడుతూ యాసంగిలో వేసుకోతగిన పంటలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు భవ్యశ్రీ, నిఖిత, లిఖిత, హర్షవర్ధిని, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

మూసీ బాధితులతో మేమే వస్తాం!

★ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సవాల్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ శుద్ధీకరణను అడ్డుకోవడమంటే హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు మరణశాసనం రాయడమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఒకసారి మూసీ పారే గ్రామాలకు వచ్చి పరిస్థితి చూడాలని, లేదంటే మూసీ బాధితులతో మేమే వస్తామని ఆయన సవాల్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. 'హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు జీవనాడిలా ఉండే మూసీ మురికికూపంలా, విషంలా తయారైంది. దీంతో 25 లక్షల మంది దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. వారిని కాపాడాల్సిన అవసరముంది. హైదరాబాద్‌లో నిత్యం 2000 ఎంఎల్‌డీల మురుగు, రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలను మూసీలోకి వదులుతున్నారు. అందులో 800 ఎంఎల్‌డీలు మాత్రమే ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తున్నారు. మిగితా నీటిని శుద్ధి చేయకుండానే మూసీలోకి విడుదల చేస్తున్నారు. చెరువుల్లోని చేపలు, గడ్డి తినే పశువులు, నీళ్ల తాగే పక్షులు పునరుత్పత్తిని కోల్పోతున్నాయి. అందుకే మూసీ నీటిని పూర్తి స్థాయిలో శుద్ధీకరణ చేయాలంటున్నాము. మురుగు పాలైన లక్షల మంది జీవితాలతో ఆడుకోవద్దని భారాస నాయకులకు విన్నపమ'ని ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

హైడ్రా బాధితులకు అండగా భారాస... మోటకొండూరు: హైడ్రా బాధితులకు అండగా భారాస ఉంటుందని ఆ పార్టీ మండల యువజన ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ యువజన నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు బురాన్, మధు, మహేష్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ దుకాణాలు మూసివేత.. .తుర్కపల్లి: రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్యతండాలో మద్యం దుకాణాలు మూసి వేయాలని తండా వాసులు, యువకులు తీర్మానించారు. ఎవరైనా మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా కట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లతీఫ్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మీర్య నాయక్, సంతోష్ నాయక్, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రత్యేక వయోధికుల శాఖ ఏర్పాటు చేయాలి .. భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయో వృద్ధులు సంక్షేమాన్ని ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శెట్టి బాలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు.. తుర్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 14వ విడత సామాజిక తనిఖీలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఝాన్సీలక్ష్మిబాయి, ఏపీవో నర్సయ్య తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను మండలంలో మొదటి విడతగా 19 గ్రామ పంచాయతీలలో బీఆర్పీలు, వీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం.. అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆజింపేట మూసీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.నాగరాజు సోమవారం తెలిపారు. ఆజింపేటకు చెందిన కన్నెబోయిన వెంకటేశ్ తన ట్రాక్టరులో ఎలాంటి అనుమతి లేకుండా మూసీవాగు నుంచి ఆదివారం రాత్రి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత... భువనగిరి పట్టణం: పట్టణంలోని 11 కేవీఏ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు డిస్కం ఏఈ సాయికృష్ణ తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల వరకు, పాత బస్టాండ్ హన్మాన్‌వాడ నుంచి న్యూవివేరా హోటల్ వరకు, గాంధీ పార్క్, ఆర్బీనగర్, సంతోష్ నగర్, పెంటాజీనగర్, సస్తాబజార్, ఠాగూర్‌రోడ్డు, సంజీవయ్యనగర్, హన్మాన్‌వాడలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

బతుకమ్మ వేడుక... భువనగిరి పట్టణం: భువనగిరి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడకను నిర్వహించారు. విద్యార్థులు రంగురంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన బతుకమ్మలతో ఆటపాటతో సందడి చేశారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం.. పోచంపల్లి, న్యూస్‌టుడే: పోచంపల్లిలో ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల బలవన్మరణం చేసుకున్న రావుల నగేష్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. రూ.40 వేల నగదు, నిత్యావసర సరకులు అందజేశారు. సాయికిరణ్, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, భాను, శ్రవణ్ పాల్గొన్నారు.

హక్కులను కాపాడే బాధ్యత అధికారులదే.. మోత్కూరు: ఎస్సీ, ఎస్టీల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ హెచ్చరించారు. సోమవారం పుర పరిధిలోని కొండగడపలో పౌరహక్కుల దినం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. తిరుమలేష్ మాట్లాడారు. తహసీల్దారు రాంప్రసాద్, ఎస్సై నాగరాజు, హెచ్‌డబ్ల్యూవో రాజాలు బాయి పాల్గొన్నారు.

ఏసీపీ చేయూత..చౌటుప్పల్: కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు చౌటుప్పల్ ఏసీపీ పి.మధుసూధన్ రెడ్డి మానవత్వంతో స్పందించి చేయూతనందించారు. స్థానిక ఏసీపీ కార్యాలయానికి కండరాల క్షీణత బాధితులను సోమవారం ఆహ్వానించారు. ఆరుగురు హాజరు కావడంతో ఒక్కొక్కరికి రూ.2000 విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. తమ బాధను గమనించి సహాయం చేసినందుకు సివియర్ డిజబిలిటీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

సేవలందించి మన్ననలు పొందాలి: డీసీసీబీ ఛైర్మన్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: సహకార బ్యాంకు ద్వారా రైతులకు, చేనేత, చేతి వృత్తుల వారికి, చిరు వ్యాపారులకు మంచి సేవలందించి మన్ననలు పొందాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. చౌటుప్పల్‌లోని డీసీసీబీ శాఖను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, గుజ్జ పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులకు జాప్యం లేకుండా పంట రుణాలు పంపిణీ చేయాలని తెలిపారు. మేనేజర్ జె.శ్రీలత, డీజీఎం కురువా నాయక్, స్థానిక శాఖ క్షేత్ర అధికారి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.